క్లుప్తంగా

30న సాహిత్య సదస్సు

కడప కల్చరల్ : యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ స్మారక గ్రంథాలయంలో ఈ నెల 30వ తేదిన ఉదయం 10 గంటలకు నెలనెల సీమ సాహిత్య సదస్సు నిర్వహించనున్నట్లు సంస్థ సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాదరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా రాయలసీమ నదీ సాహిత్యం రెండవ భాగం గురించి గ్రౌండ్ వాటర్ అండ్ వాటర్ఆడిట్ డిపార్టుమెంట్ విశ్రాంత సంచాలకులు ఎ.వరప్రసాద్‌రావు ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

మంటలు ఆర్పే విధానంపై మాక్ డ్రిల్



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కడప అర్బన్ : ఏజీ అండ్ పీ సిటీ గ్యాస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో లెవెల్–2 మాక్‌డ్రిల్ కార్యక్రమం నిర్వహించినట్లు కడప అసిస్టెంట్ జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి బసివిరెడ్డి, రిమ్స్ ఏఎస్ఐ యోగా రాయల్ తెలియజేశారు. కడప నగర శివారులోని ఐడీపీ పుట్లంపల్లి ఎల్‌సీఎన్‌జీ ప్లాంట్‌లో ఈ సందర్భంగా సీఎన్‌జీ ఫిల్లింగ్ పోస్ట్‌లో మంటలు వ్యాపించడంతో సైరన్ మోగడం వల్ల సిబ్బంది అప్రమత్తమై మంటలను ఆర్పివేసే సన్నివేశాన్ని ప్రదర్శిస్తారు. ఈ కార్యక్రమానికి ఏజీ అండ్ పి ప్రథమ్ బృందంతోపాటు ఏపీ ఫైర్ ఎమర్జెన్సీ సర్వీసెస్, హెచ్‌పీసీఎల్, ఐటీసీఎల్, రైల్వేస్, ఏపీ అగ్నిమాపక శాఖ ప్రతినిధులు హాజరయ్యారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిళ్ళ బాబు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిళ్ళ బాబు పేర్కొన్నారు. నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వం విద్యార్థుల పట్ల ఏ మాత్రం ప్రేమ ఉన్నా ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు బుక్స్, యూనిఫామ్, బెల్టులు అమ్ముతుంటే జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడం దారుణం అన్నారు. ఇప్పటికైనా వారు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ రక్తగ్రూపు తెలుసుకోవాలి



చిన్నారులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి ఒక్కరూ తమ రక్త గ్రూపును తెలుసుకోవాల్సిన అవసరాన్ని గుర్తించాలని రిమ్స్ బ్లడ్ బ్యాంక్ వైద్యులు డాక్టర్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. శుక్రవారం ప్రకాశ్‌నగర్‌లోని జేఎస్ఓఎస్ ఆర్గనైజేషన్‌లో 85 మంది చిన్నారులకు రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలను జేబీవీఎస్ ది ప్రిజర్వర్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్త గ్రూపు తెలుసుకుంటే అవసరమైన సమయంలో రక్తదానం చేసి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. సంస్థ వ్యవస్థాపకులు అశోక్ మాట్లాడుతూ రక్త నిర్ధారణ కార్యక్రమం గురించి తెలియజేయగానే స్పందించినందుకు రిమ్స్ బ్లడ్ బ్యాంక్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ జాయింట్ సెక్రెటరీ విజయ్, ల్యాబ్ టెక్నీషియన్స్ నారాయణస్వామి, బలరామ్, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

బడి బయట పిల్లలు బడిలో ఉండాలి

చెన్నూరు : మండలంలోని ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, జిల్లా పరిషత్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల విద్యాశాఖ అధికారి గంగిరెడ్డి సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, విద్యార్థులకు బోధన విధానం అనే విషయాలపై దీక్ష యాప్‌లో అప్లోడ్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి–2 సునీత, జిల్లా అకడమిక్ అధికారి రామాంజనేయరెడ్డి, అసిస్టెంట్ కమ్యూనిటీ మొబైల్ అధికారి దశరదరామిరెడ్డి, ఏఎల్ఎస్‌సీ విశ్వనాథరెడ్డి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

భాగవత పఠనం

సింహాద్రిపురం : కసునూరు గ్రామంలోని శివాలయంలో రెండవరోజు శుక్రవారం భాగవత పఠనం కొనసాగింది. పులివెందుల భాగవత భక్త సమాజం వారు నిర్వహించిన భాగవత పఠనం గ్రామస్థుల సహాయ సహకారాలతో నిర్వహించారు.

పరిశుభ్రతతోనే మెరుగైన ఆరోగ్యం



కడప రూరల్ : పాత కడపలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో డీఎంహెచ్ఓ నాగరాజు



కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రజలకు లార్వాపై అవగాహన కల్పిస్తున్న వైద్య బృందం

కడప రూరల్ : పరిశుభ్రతతోనే మెరుగైన ఆరోగ్యం సమకూరుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. శుక్రవారం స్థానిక పాత కడపలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. వారానికి ఒక సారి ఇంటిలోని తొట్లు, కుండలు, బానలు శుభ్రం చేసుకోవాలని తెలిపారు. డయేరియా రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా స్థానికులు మంచి నీరు బురదగా వస్తున్నాయని తెలిపారు. అందుకు స్పందించి డీఎంహెచ్ఓ రూరల్ వాటర్ ఇంజినీరింగ్ అధికారిని పిలిచి కుళాయిల్లో బురద నీరు రాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి మనోరమ, ఏఎంఓ వెంకటరెడ్డి, సబ్ యూనిట్ ఆఫీసర్ నాగలక్ష్మిరెడ్డి, శంకర్‌రెడ్డి, ఇంతియాజ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

లార్వాపై అవగాహన

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర పరిధిలోని నాగరాజుపేట అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ పరిధిలోని మారుతి నగర్, సీయోనుపురం, రాముల గుడివీధుల్లో శుక్రవారం హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్నలత ఆధ్వర్యంలో వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్ వర్ధన్ లార్వాపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా లార్వాకు సంబంధించిన లార్వా కంటైనర్స్ అన్నింటిని పరిశీలించి ప్రజలకు లార్వా గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. లార్వాలు మూడు దశలలో దోమగా మారే దాని గురించి ప్రజలకు అవగాహన కల్పించి వీటిని నుంచి జాగ్రత్తలు పొందాలని సూచించారు. ఈ రెండు మాసాలు కూడా యాంటీ మలేరియా, డెంగ్యూ మాసోత్సవాలు జరుగుతున్నందున ప్రతి ఒక్కరూ ఫ్రైడే డ్రైడే పాటించాలన్నారు. ప్రతి శుక్రవారం నీరు నిల్వ ఉన్న తొట్టలను శుభ్రపరచి ఒక గంట సేపు ఆరబెట్టి ఆ తరవాత వాడుకోవాలని సూచించారు. వాటర్ పైప్‌లైన్ లీకేజీ ఎక్కడైనా ఉన్నట్లయితే వెంటనే వార్డు సెక్రటరీకి తెలియపరచి మరమ్మతు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో హోమియోపతి ట్రైనింగ్ స్టూడెంట్స్ డాక్టర్ అనూష, గ్రీష్మ, శ్వేత, హేమంత్, రవిశంకర్, స్నేహ, సూపర్ వైజర్ సుబ్బరాయుడు, ఆశా కార్యకర్త దేవి పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణతో ప్రశాంత జీవనం గడపాలి



సన్మానం పొందిన ఉద్యోగ విరమణ ఉపాధ్యాయులు

కడప ఎడ్యుకేషన్ : ఉద్యోగ విరమణ తర్వాత ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు ప్రశాంతమైన జీవనం గడపాలని కడప మండల విద్యాశాఖ అధికారులు పాలెం నారాయణ, షేక్ ఇర్షాద్ అహ్మద్ సూచించారు. కడప మండల వనరుల కేంద్రంలో శుక్రవారం 2024 జనవరి నుంచి మండల పరిషత్, కార్పొరేషన్, ఎయిడెడ్ యాజమాన్యాలో పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన 18 మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంఈఓలు మాట్లాడుతూ ఉద్యోగంలో చేరిన ప్రతి ఒక్కరికి ఏదో ఒక రోజు పదవీ విరమణ తప్పదన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం ఎలాంటి ఒత్తిడి లేకుండా కుటుంబ సభ్యులతో ప్రశాంత జీవనం సాగించాలని కోరారు. మండల పరిధిలోని ఉపాధ్యాయ సంఘ నేతలు మాట్లాడుతూ గతంలో రిటైర్డ్ అయిన ప్రతి ఉద్యోగికి సన్మాన కార్యక్రమం నిర్వహించే వారిమని, అయితే రిటైర్మెంట్ వయసు పెంచడంతో కొన్ని అనివార్య కారణాలతో కొంత మందిని సన్మానించలేక పోయామన్నారు. ఇప్పుడు మళ్లీ వాటిని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఉద్యోగ విరమణ ఉపాధ్యాయులు తమ ఉద్యోగానుభవాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు గుజ్జల తిరుపాల్, మోపూరు శివారెడ్డి, చల్లా మధుసూధన్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, పోరెడ్డి రామాంజనేయులు, నర్సారెడ్డి, నరసింహులు, రమణారెడ్డి, బాలానాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థి దశ నుంచే ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకుంటే జీవితంలో ఎముకలు, కీళ్లతోపాటు షుగర్ వ్యాధికి దూరంగా ఉండవచ్చని ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడప యస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యాసాగర్ ఆర్థరైటిస్ ఫౌండేషన్ వారి సహకారంతో ఎముకలు, కీళ్లు, షుగర్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి, డయాబెటీస్ వైద్యులు డాక్టర్ శ్రీలక్ష్మిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఎముకలు, కీళ్లకు సంబంధించి వచ్చే సమస్యలతోపాటు షుగర్‌వ్యాధి గురించి అవగాహన కల్పించారు. వీటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వీర సుదర్శన్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమించాలి



డీఈఓకు వినతిపత్రం సమర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా ఉన్నత పాఠశాలల్లో పని చేస్తూ ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన సబ్జెక్టు ఉపాధ్యాయుల స్థానంలో ఎస్‌జీటీలకు పదోన్నతులు కల్పించాలని, అప్పటి వరకు తాత్కాలిక పని సర్దుబాటు కింద ఉపాధ్యాయులను నియమించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్‌బాబు కోరారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత తీర్చాలని కోరుతూ శుక్రవారం యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో డీఈఓ మర్రెడ్డి అనురాధకి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల జిల్లాలోని వివిధ హైస్కూళ్లలో ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ పొందారన్నారు. ఈ కారణంగా పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై 15 రోజులు గడిచిందని, ఉద్యోగ విరమణ చేసిన వారి స్థానంలో ఉపాధ్యాయులను నియమించకపోవడంతో బోధన కుంటుపడుతోందన్నారు. ముఖ్యంగా 10వ తరగతి విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందన్నారు. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరతను అధిగమించడానికి ఎస్‌జీటీలకు పదోన్నతులు కల్పించే వరకు తాత్కాలిక ప్రాతిపదికన సర్దుబాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రమణ, నాయకులు సురేష్‌కుమార్, గోపీనాథ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు రాయితీలు కల్పించాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయ సంఘ నాయకులు

కడప స్పోర్ట్స్ : రైల్వే, ఆర్టీసీ బస్సుల్లో క్రీడాకారులకు టోర్నమెంట్‌లకు వెళ్లే సమయంలో రాయితీలు కల్పించాలని వైఎస్ఆర్ కడప జిల్లా స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ నాయకులు కోరారు. శుక్రవారం రాయచోటి పట్టణంలో రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రామప్రసాద్‌రెడ్డిని వారు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బి.శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ యూజీ పీఈడీ డిగ్రీ అర్హత ఉన్న వ్యాయామ ఉపాధ్యాయులకు ఒక సంవత్సరం బ్రిడ్జి కోర్సు ఏర్పాటు చేసి వారికి కూడా స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. 250 మంది విద్యార్థులు పైగా ఉన్న ప్రతి ఉన్నత పాఠశాలకు అదనపు వ్యాయామ ఉపాధ్యాయ పోస్టును మంజూరు చేయాలన్నారు. 117 జీఓను రద్దు చేసి హైస్కూల్స్‌లో రద్దు చేసిన పీఈటీ పోస్టులను తిరిగి పునరుద్ధరించాలన్నారు. అప్పర్ ప్రైమరీ పాఠశాలలకు వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేయాలన్నారు. కేజీబీవీ పాఠశాలల్లో పని చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులకు మినిమం టైమ్‌స్కేల్ వర్తింపచేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, రామచంద్ర, జగదీశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిశోధకుడికి డాక్టరేట్



అశోక్

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం కామర్స్ విభాగం పరిశోధకుడు బి.అశోక్‌కు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. విశ్వవిద్యాలయ కామర్స్‌శాఖ సహ ఆచార్యులు డాక్టర్ జి.హరినాథ్ పర్యవేక్షణలో 'పర్ఫామెన్స్ అనాలసిస్ ఆఫ్ ఇండియన్ మ్యూచువల్ ఫండ్స్ విత్ స్పెషల్ రెఫర్స్ టు ఈక్విటీ లింక్డ్ సేవింగ్ స్కీం' అనే అంశంపై ఈయన చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ ప్రకటించారు.

క్రమపద్ధతి విధులతో ఒత్తిడి దూరం



లక్ష్మీనరసింహ ప్రసాద్‌ను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

వైవీయూ : అధ్యాపకులు క్రమపద్ధతిలో విధులు నిర్వర్తిస్తే ఒత్తిడి దూరం అవుతుందని అనంతపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర అధ్యాపకుడు డి.లక్ష్మీనరసింహప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో ఐక్యూఏసీ ఆధ్వర్యంలో 'స్ట్రెస్ మేనేజ్‌మెంట్'పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఏదో ఒక రకంగా ఒత్తిడి ఎదుర్కొంటూనే ఉంటారన్నారు. తల్లిగర్భం మొదలు జీవితకాలం ఒత్తిడి ఉంటుందని, అయితే చేసే పనిని ఇష్టపూర్వకంగా చేయడం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చని సూచించారు. చేసే పనిలో సమన్వయం పాటిస్తూ, కొంత విరామం తీసుకోవడం ద్వారా ఒత్తిడిని జయించవచ్చన్నారు. అనంతరం విద్యార్థులకు ఒత్తిడిని జయించే మార్గాలను వివరించారు. అనంతరం లక్ష్మీనరసింహప్రసాద్‌ను అధ్యాపకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సలీంబాషా, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేటి నుంచి కోగటం ఉరుసు

కమలాపురం : మండల పరిధిలోని కోగటం గ్రామంలో వెలసిన హజరత్ సయ్యద్ షా ఆలంపీర్ ఖుద్దిససిర్రహు వారి ఉరుసు కార్యక్రమాలు శనివారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం గంధం, ఆదివారం ఉరుసు మహోత్సవాలను కీ.శే. గండ్లూరు పెద్ద వీరారెడ్డి కుటుంబ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం రాత్రి లక్ష్మయ్య శెట్టి వారి ఇంటి నుంచి గంధోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. పకీర్ల మేళతాళాలతో, పూల చాందిని అలంకరణలో గంధోత్సవాన్ని పుర వీధులలో నిర్వహించి అనంతరం దర్గాలోని స్వామి మజార్‌పై ఎక్కిస్తామన్నారు. భక్తులు విరివిగా పాల్గొని గంధోత్సవాన్ని జయప్రదం చేయాలని నిర్వాహకులు తెలిపారు.

30న ఆలంపీర్ ఉరుసు

ఈనెల 30వ తేదీన సయ్యద్ షా ఆలంపీర్ ఉరుసు మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాత్రి 9 గంటలకు మోపూరి ఎల్లారెడ్డి ఇంటి నుంచి జెండా ఊరేగింపు నిర్వహిస్తామని వారు తెలిపారు. అనంతరం ఫ్రెండ్స్ ఆర్కెస్ట్రా కడప వారిచే పాటకచేరి నిర్వహించనున్నారు. అనంరతం జి.వీర ప్రతాప్‌రెడ్డి (హైద్రాబాద్) ఆధ్వర్యంలో గొప్ప ఖవ్వాలీ పోటీ నిర్వహించనున్నారు. ఆగ్రాకు చెందిన ఖాసిం హనీఫ్ సాబ్రి, నాగ్‌పూర్‌కు చెందిన మొహసిన్ చిష్టి ఖవ్వాల్‌ల మధ్య ఖవ్వాలీ పోటీ నిర్వహించనున్నారు. అలాగే దర్గా పీఠాధిపతి సయ్యద్ షా తాహీర్ మొహిద్దీన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

వేముల : మండలంలోని వి.కొత్తపల్లె గ్రామంలో శ్రీ పుట్టకోనమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామస్తులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పుట్టకోనమ్మ అమ్మవారును గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు చేసిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

దేవాలయాల పాలక మండళ్లకు అనుమతులు

కడప కల్చరల్ : జిల్లా దేవదాయ ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో కడప నగరంలోని మూడు దేవాలయాలకు పాలక మండళ్లను నియమించేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందని కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ ఎ.శ్రీధర్ తెలిపారు. శుక్రవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ కడప నగరంలోని పలు దేవాలయాలకు పాలక మండళ్ల గడువు పూర్తి కావడంతో ఇప్పటికే వాటిని భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చామని తెలిపారు. ప్రస్తుతం అనుమతుల విషయంలో స్పష్టత రావడంతో మరోమారు నోటిఫికేషన్ ఇస్తున్నట్లు తెలిపారు. నగరంలోని మృత్యుంజయకుంటలోగల శ్రీ మృత్యుంజయేశ్వరస్వామి ఆలయం, పుట్లంపల్లె పరిధి పాలకొండల్లోగల శ్రీ పాలకొండ్రాయస్వామి ఆలయం, నగరంలోని మోచంపేటలోగల శ్రీ ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయాలకు పాలక మండళ్లను నియమించేందుకు అనుమతి లభించిందని దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీ ఉత్తర్వులు జారీ చేసినట్లు వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ ప్రకటన వెలువడిన 20 రోజుల్లోపు తమ దరఖాస్తులను జిల్లా దేవాదాయశాఖ ప్రధాన కార్యాలయానికి చేర్చాలని సూచించారు. అర్హత తదితర అంశాల పరిశీలన అనంతరం చట్టప్రకారం వారిలో అర్హులను గుర్తించి నూతన పాలక మండళ్లను నియమిస్తారని వివరించారు. పూర్తి వివరాల కోసం 73963 54149 నంబరులో తమను సంప్రదించాలని సూచించారు.

శ్మశాన వాటికలో మురుగు నీటిని తొలగించాలి



శ్మశాన వాటికను పరిశీలిస్తున్న డీహెచ్‌పీఎస్ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రామరాజుపల్లె గూడూరు దళితవాడ శ్మశాన వాటికలోని మురుగు నీటిని తొలగించాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి మునెయ్య పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని రామరాజుపల్లె గూడూరు దళితవాడలో నిలిచిన మురుగునీటిని డీహెచ్‌పీఎస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్లుగా స్పందన కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ శ్మశాన వాటికను అభివద్ధి చేయాలని అనేకమార్లు వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ఇటీవల అనారోగ్యంతో ఓ బాలిక చనిపోవడంతో మురుగునీటిలోనే పూడ్చివేయడం జరిగిందన్నారు. మట్టితోలి శ్మశాన వాటిక ఎత్తు పెంచాలని కోరారు. ఇప్పటికైనా కమిషనర్ స్పందించి శ్మశానవాటికను అభివృద్ధి చేసి, వరదనీరు, డ్రైనేజీ నీరు శ్మశాన వాటికలోకి వెళ్లకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ నాయకులు ఇమ్మానియేల్, చంద్ర, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తే అనర్థాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వేమల సలీంబాషా

వైవీయూ : వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తే అనర్థాలు కలుగుతాయని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేమల సలీంబాషా పేర్కొన్నారు. శుక్రవారం కళాశాల అర్థశాస్త్ర విభాగం, ఐక్యూఏసీ విభాగం ఆధ్వర్యంలో 'వ్యవసాయంపై వాతావరణ మార్పుల ప్రభావాలు' అనే అంశంపై ఒక్కరోజు జాతీయ సదస్సు వర్చువల్ విధానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దేశంలో అధిక జనాభా వ్యవసాయ రంగం మీదనే ఆధారపడి జీవిస్తున్నారని, కావున ఈ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తే అభివృద్ధి మందగిస్తుందన్నారు. వాతావరణంలో మార్పుల వల్ల వ్యవసాయ రంగం నష్టాల పాలవుతోందన్నారు. అనంతరం గూగుల్ మీట్ ద్వారా వైవీయూ అర్థశాస్త్ర ఆచార్యులు డాక్టర్ అనిత, తాడిపత్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు సి.అన్నపూర్ణ, నిజామాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ ఎ.ఆదెప్ప హాజరై సదస్సు గురించి ఉపన్యసించారు. ఆహారభద్రత, వ్యవసాయ సంక్షోభాన్ని అధిగమించేందుకు గల మార్గాలను వివరించారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్ డాక్టర్ జి.విజయలక్ష్మీదేవి, కో కన్వీనర్ డాక్టర్ సి.వి.కృష్ణవేణి, ఆర్గనైజింగ్ సెక్రటరీలు డాక్టర్ గురుమోహన్‌రెడ్డి, డాక్టర్ కె.శాలిని, డాక్టర్ పి. శచీదేవి, డాక్టర్ ప్రకాష్‌నారాయణరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కడప ఉక్కు పరిశ్రమను నిర్మించాలి



మాట్లాడుతున్న పీఆర్ఎస్‌వైఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : రాయలసీమ ప్రాంతంలోని నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కడప ఉక్కు పరిశ్రమ పనులను ప్రారంభించాలని పీఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కన్నెలూరు శంకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కడప నగరంలోని పీఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణం కడప జిల్లా ప్రజల చిరకాల ఆకాంక్ష అన్నారు. గతంలో కడప ఉక్కు రాయలసీమ హక్కు నినాదంతో ప్రజలు, యువత, నిరుద్యోగులు అనేక పోరాటాలు చేశారన్నారు. గతంలో పాలకవర్గాలపై ఒత్తిడి పెంచడంతో శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. కానీ పనులు చేపట్టలేదన్నారు. ఉక్కు పరిశ్రమ నిర్మాణం జరిగితే రాయలసీమ ప్రాంతంలోని వేల మంది నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందన్నారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వమైనా ఉక్కు పరిశ్రమ ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా కన్వీనర్ నాగేంద్రబాబు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నగర సమస్యలు పరిష్కరించాలి



కడప నగరంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మాధవీరెడ్డి

కడప రూరల్ : కడప నగరంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి మున్సిపల్ అధికారులు, ఎలక్ట్రికల్ సిబ్బందికి సూచించారు. ఆమె కడప నగరంలో పర్యటించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాలను సందర్శించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

కడప నగరంలోని గౌసనగర్‌లో మౌలిక సదుపాయాలు కల్పించి సమస్యలను పరిష్కరించాలని జేకే యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుల లయన్ పీ ఖాదర్‌బాషా తెలిపారు. ఆ మేరకు కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఆ కాలనీ వాసులు అమానుల్లా, షేక్ హబీబుల్లా, శ్రీలత, రజియా తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో క్రైస్తవులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని క్రైస్తవ ఇండిపెండెంట్ పాస్టర్ల సంఘం జిల్లా అధ్యక్షులు రెవ డాక్టర్ మల్లెం విజయభాస్కర్ కోరారు. క్రైస్తవ ఇండిపెండెంట్ పాస్టర్లు శుక్రవారం కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డిని ఆమె కార్యాలయంలో కలిసి సత్కరించారు. కమ్యూనిటీ హాలు, పాస్టర్స్ గౌరవ వేతనం, చర్చిల నిర్మాణాలు, క్రైస్తవుల నిధులు పక్కదారి పట్టకుండా క్రైస్తవులకు అందించే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు జయరాజు, పి.మహేష్, ఇజ్రాయిల్, సిస్టర్లు హెప్సిబా, రాజకుమారి, పాస్టర్ అబ్రహం, జాన్సన్, రాజన్న, దేవరాజు, ఐజక్, రవితేజ, క్రిస్టఫర్, జైపాల్, రమేష్, జాన్ పాల్, సాల్మన్ రాజు, సెల్వన్, నాగేంద్ర, రెడ్డప్ప, హరి తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే.. అంతే..!



ప్రమాదకర స్థితిలో మ్యాన్‌హోల్

కడప కల్చరల్ : రోడ్ల మధ్య, కూడళ్లలో మ్యాన్‌హోళ్లు ఉండటం సహజం. కొన్నిచోట్ల నిర్వహణ లోపంతో అవి ప్రమాదకరంగా మారుతున్నాయి. ఇటీవల కాలంలో ఈ పరిస్థితులు లేకపోయినా మళ్లీ క్రమంగా ప్రమాదాల స్థాయికి చేరుతున్నాయి. ఈ ఫొటోలో కనిపిస్తున్న మ్యాన్‌హోల్ గడ్డిబజారు వీధిలో ఉంది. అక్కడి దేవాలయాల సమీపంలో పడమరవైపు శాంతారం పసుపు మిషన్‌కు ఉత్తరాన పెద్దదర్గాకు, దక్షిణాన అమ్మవారిశాలకు వెళ్లే రోడ్ల కూడలిలో ఈ మ్యాన్ హోల్ ఉంది. ఇది సాధారణమైనదిగాక ఇనుప ఫ్రేమ్‌తో పటిష్టంగానే ఏర్పాటు చేశారు. కానీ కారణం ఏదైనా దానిపై మూసిన రేకు లోపలికి జారిపోవడంతో దాదాపు అడుగు లోతు గుంత ఏర్పడింది. దాన్ని చూసుకోకుండా ఆదమరిచి అటువైపు వస్తే మ్యాన్‌హోల్‌లో ద్విచక్ర వాహనమైతే తప్పక ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. పాదచారులకు కూడా ఇది ప్రమాదకరంగా పరిణమిస్తుంది. ఇంకా హౌసింగ్‌బోర్డు కాలనీ వద్ద రాజీవ్‌మార్గ్ కూడలిలో ఐఏఎస్ అధికారి సుబ్రమణ్యం విగ్రహం ఉంది. ఆ విగ్రహానికి సమీపంలో దక్షిణాన ఇటీవల తారురోడ్డుపై అడుగులోతు గుంత ఏర్పడింది. నిత్యం పాదచారులు, పలు రకాల వాహనాలతో బిజీగా ఉండే ఈ రోడ్డులో ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. సంబంధిత అధికారులు వీటిని వెంటనే మరమ్మతు చేసి పరిస్థితులు చక్కదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.